www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 మే 2025 | 8 పేజీలు


వైఎస్ఆర్


అన్నమయ్య

తెల్ల బంగారం.. ధరలు పాతాళం

- దిగుబడి బాగున్నా.. ధర నిల్
- గత ఏడాది క్వింటా రూ.10 వేలకు పైగా పలికిన వైనం
- ప్రస్తుతం రూ.7 వేలకే పరిమితం
- ఆందోళనలో పత్తి రైతులు



ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాగైన పత్తి పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. ధరలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. పంట సాగు సమయంలో ధరలు ఆశాజనకంగా ఉన్నప్పటికి దిగుబడి చేతికి అందివచ్చే సమయానికి తగ్గుముఖం పట్టినది. ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు. గత ఏడాది పత్తి పంటకు గిట్టుబాటు ధర ఉండటంతో ఎక్కువ మంది రైతులు పంట సాగు చేపట్టారు. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఎకరా సాగుకు రూ. 40 వేల నుంచి రూ. 50 వేల వరకు ఖర్చులు అయ్యాయని పేర్కొంటున్నారు. కిలో పత్తి ధర ప్రారంభంలో రూ. 85 నుంచి రూ. 90 వరకు పలికింది. ప్రస్తుతం రూ.70కు తగ్గింది. గతంలో సిసిఐ రూ. 98కి కొనుగోలు చేసింది. ఈ ఏడాది దిగుబడి చేతికి అంది వచ్చిన తరువాత రూ. 65 నుంచి రూ. 72 కు చేరింది. గతంలో దిగుబడి ఆశాజనకంగా లేని సమయంలో క్వింటా రూ.105 వరకు పలికింది. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు కూడా పత్తి రైతులు నోచుకోవడంలేదు.


మైదుకూరులో సాగులో ఉన్న పత్తి పంట

జిల్లాలో మైలవరం, రాజుపాలెం, వేముల, తొండూరు, విఎన్‌పల్లి, పెద్దముడియం మండలాల్లో ఐదు వేల ఎకరాలకు పైగా, కొండాపురం ,కలస పాడు, బి.మఠం, పోరుమామిళ్ల, ఖాజీపేట, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ముద్దనూరు, సింహాద్రిపురం, లింగాల, పులివెందుల, యర్రగుంట్ల , కమలాపురం, వల్లూరు మండలాలలో రెండు వేల ఎకరాల వరకూ, మిగిలిన మండలాల్లో 50 ఎకరాలలోపు రైతులు పత్తి పంటను చేశారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో జిల్లాలో 60 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. సాధారణంగా ఎకరాకు 20 క్వింటాళ్లకు 2లో

విఆర్ఎలకు వేతనాలు పెంచాలి

- జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్

ప్రజాశక్తి-కడప అర్బన్

విఆర్‌ఎలకు వేతనాలు పెంచాలని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బి.మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట విఆర్‌ఎ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సేవకులకు 11 సంవత్సరాలుగా వేతనాలు పెంచకపోవడం బాధాకరమని తెలిపారు. అర్హులైన వారికి అందరికీ ప్రమోషన్లు ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలామందికి ఇండ్ల స్థలాలు ఇల్లు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నైట్ డ్యూటీలు ఇతర డ్యూటీలు వేసి పనిచేయుచుకుంటున్నారని తెలిపారు. 2లో

ఉచిత డిఎస్‌సి కోచింగ్ ఉపయోగకరం

- డిఇఒ షంషుద్దీన్ 8లో


నందిపాడులో నిల్వ ఉంచిన పత్తి

తెల్ల బంగారం.. ధరలు పాతాళం

(మొదటి పేజీ తరువాయి) పైగా దిగుబడి వస్తుంది. ఈ ఏడాది చీడపీడలు, గులాబి పురుగు లోకం వలన 15 క్వింటాళ్ల లోపు దిగుబడులు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా పత్తి పంట సాగుకు రూ. 40 వేల నుంచి 50 వేల వరకు సాగు ఖర్చులు అవుతున్నాయి. ప్రస్తుతం ధరలు రూ.7వేల లోపు మాత్రమే ఉండడంతో ఏమాత్రం ఆదాయం సమకూరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 క్వింటాళ్లకు పైబడి దిగుబడి వచ్చిన రైతులకు మాత్రమే కాస్త ఆదాయం వస్తుంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గిట్టుబాటు ధర అమలు అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

దళారుల దగా...

రైతులకు వేర్వేరు కారణాలు చూపి దళారులు మభ్యపెట్టేవారు. నాణ్యత, రంగు లేదని సాకులు చూపుతూ తక్కువ ధర నిర్ణయిస్తున్నారు. దళారీలు పత్తి రైతుల వద్ద తక్కువ ధరలకు సేకరించి పత్తిని ప్రొద్దుటూరు, గుంటూరు, నంద్యాల, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ మిల్లులలో అమ్ముకుంటూ అధిక ధరలు సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాలలో తూకాలు వేసే సందర్భంలో కూడా చాలావరకు మోసాలకు పాల్పడుతున్నప్పటికీ కట్టడి చేయడంలో అధికారులు విఫలమౌతున్నారు. ప్రస్తుతం ధరలు తగ్గడంతో పత్తి కోసం వ్యాపారులు గ్రామాల బాట పట్టిన రైతులు అమ్మకాలకు విముఖత చూపుతున్నారు. ఖాజీపేట మండలం తుడుమలదిన్నె, నందిపాడు, తవ్వారుపల్లె, గుత్తికొట్టాలు, శాంతినగరం గ్రామాల పరిధిలో రైతుల వద్ద టన్నుల కొద్ది పత్తి నిల్వలు అధికంగా ఉన్నాయి. గృహలలో ఏ రైతు వద్ద చూసినా పత్తి నిల్వలు అధికంగా ఉన్నాయి. కొన్ని గ్రామాలలో పంటపోలాలలోనే పత్తి దిగుబడులను నిల్వ ఉంచారు. ఎండకు, వానకు పత్తి దెబ్బతింటున్నదని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం పత్తి పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

పత్తి అమ్మకాలు చేయకుండా నిల్వ ఉంచాం

పత్తి పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో అమ్మకాలు చేపట్టకుండా నిలువ ఉంచాం. ఈ ఏడాది ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. పది ఎకరాలలో పత్తి పంటను సాగు చేపట్టాను. 100 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. పత్తి పంటకు సరైన గిట్టుబాటు ధర వస్తుందని వేచి చూస్తున్నాం. ప్రస్తుతం ఉన్న ధరలతో సాగు ఖర్చులు సరిపోతాయి. ప్రభుత్వం పత్తి పంటకు సరైన గిట్టుబాటు ధరను కల్పించాలి.

- సుబ్బారెడ్డి రైతు, నందిపాడు, ఖాజీపేట మండలం.

గిట్టుబాటు ధర కల్పించాలి

పత్తి పంటకు ప్రభుత్వం రూ. 10 వేల వరకు గిట్టుబాటు ధర కల్పించాలి ప్రస్తుతం పెరిగిన సాగు ఖర్చుల వల్ల ఎకరాకు రూ. 50 వేలకు పైగా ఖర్చులు అవుతున్నాయి. ప్రస్తుతం క్వింటా రూ. 7వేలు మాత్రమే ధరలు పలుకుతున్నాయి. ధరలు పెరుగుతాయని ప్రస్తుతం పత్తి అమ్మకాలు చేపట్టడం లేదు. రెండు సంవత్సరాలకు సంబంధించిన దిగుబడిని నిల్వ ఉంచాం ధరలు పెరుగుతాయని వేచి చూస్తున్నాం.

-నాగేశ్వర్ రెడ్డి, గాంధీనగరం, చాపాడు మండలం.

సిద్ధవటం కోర్టు ఎజిపిగా ఆదినారాయణ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఎజిపిగా ఒంటిమిట్ట గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది జి.ఆదినారాయణరావును సిద్ధవటం కోర్టు ఎజిపిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈయన 12 సంవత్సరాలుగా న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ న్యాయవి భాగంలో పలు కీలక పదవులను చేసి తెలుగుదేశం పార్టీలో గుర్తింపు పొందారు. ఈయన తెలుగుదేశం పార్టీకి చేసిన పనులను గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నియమించారు. ఈ నియామకానికి సహకరించిన ఉమ్మడి కడప జిల్లాలోని నాయకులు, తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విఆర్ఎలు

విఆర్ఎలకు వేతనాలు పెంచాలి

(మొదటి పేజీ తరువాయి) సంవత్సరాల తరబడి నామినీల్‌గా పనిచేసిన వారిని కొన సాగించాలని పేర్కొన్నారు. 20గా ఉన్న శాతాన్ని 70 శాతానికి ప్రమోషన్స్‌లో పెంచాలన్నారు. విఆర్ఎలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార కోసం లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన పెద్ద ఎత్తున దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొ నాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, విఆర్ఎ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, వెంకటపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, పవన్, మునయ్య పెద్ద నారాయణ, వెంకటసుబ్బయ్య, ఊదయ్, విఆర్ఎలు పాల్గొన్నారు. అనంతరం జెసి అతిథి సింగ్‌కి వినతి పత్రం అందజేశారు. జిల్లా పరిధిలోని సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. తెలిపారు.

షర్మిలను హౌస్ అరెస్టు చేయడం తగదు : డిసిసి

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

విజయవాడలో కారణం లేకుండా షర్మిలను హౌస్ అరెస్టు చేయడం తగదని డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశమా లేక నియంత పాలనలో ఉన్నామా అని ప్రశ్నించారు. దేశ ప్రధాని రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ఏఏ విషయాలు చర్చించాలో తెలుసుకొనందుకు కమిటీ వేశామని అందులో భాగంగా షర్మిల ఉంటే ఇంట్లోనే హౌస్ అరెస్టు చేయడం ఇది ఎక్కడి న్యాయమన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్.శివ మోహన్‌రెడ్డి, జిల్లా కమిటీ కార్యదర్శి వెంకటస్వామి పాల్గొన్నారు. **కడప:** షర్మిల హౌస్ అరెస్టు దారుణమని కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షులు హమీద్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను ఎందుకు ఉల్లంఘించాలని ప్రయత్నిస్తు న్నారన్నారు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని తెలిపారు. సమావేశంలో డివిజన్ ఇన్‌ఛార్జులు బాబ్జి, జహార్, కమల్, దినకర్‌రెడ్డి, రంతుల్లాఖాన్ పాల్గొన్నారు. **చాపాడు:** షర్మిలను హౌస్ అరెస్టు చేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ మైదుకూరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ చాపాటి రామ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎడిపై యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో ఎలాంటి గుర్తింపు లేకుండా విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేస్తూ అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఎడిపై పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షుడు నరసింహ లు మాట్లాడుతూ నిమ్మనపల్లి మండల కేంద్రంలో ఎడిపై పాఠశాల యాజమాన్యం ఎలాంటి అనుమతులు లేకుండా చదువు పేరుతో కోట్ల రూపాయలు సంపాదించడానికి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసే విధంగా అక్రమ అడ్మిషన్లు నిర్వహి స్తు న్నారన్నారు. ఆ పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని గతంలో సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు వినతి పత్రం ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోక పోవ డంతో యధావిధిగా అడ్మిషన్లు కొనసాగిస్తున్నారని అన్నారు. ఎడిపై పాఠశాల యాజమాన్యం పలుమార్లు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటే మండల విద్యాశాఖ అధికారులు తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అయినప్పటికీ పాఠశాల యాజమాన్యం అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేసే విధంగా అక్రమాలకు పాల్పడుతూ, ధైర్యంగా అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు అక్రమ అడ్మిషన్లు చేస్తున్న ఎడిపై పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, విష్ణు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

ప్రజలతో దాగుడుమూతలాడుతున్న వైసిపి

ప్రజాశక్తి-కడప అర్బన్


మీడియాతో మాట్లాడుతున్న గౌస్‌పీర్

వక్ఫ్ సవరణ బిల్లు విషయంలో వైసిపి ప్రజలతో దాగుడుమూతలు ఆడుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ విమర్శించారు. బుధవారం కాగితాలపెంటలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి లాంగ్ మార్చ్ రూపంలో ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమం మరొకసారి చేస్తుందని విమర్శించారు. వైసిపి వక్ఫ్ బోర్డ్ సవరణకు విరుద్ధమని ప్రజలకు వెన్నుపోటు మాటలతో మభ్యపెడుతుందని తెలిపారు. ఇది ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. గతంలో ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ విషయంలో వైసిపి వైఖరి ప్రజలు గమనించారని పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు ద్వంద వైఖరి ప్రదర్శించారని తెలిపారు. ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిల హౌస్ అరెస్టును ఖండిస్తున్నామని చెప్పారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా రాజ్యాంగబద్ధంగా పాలన సాగించాలని, లేకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షులు అబ్దుల్ గఫార్, కడప సిటీ మైనారిటీ అధ్యక్షులు ముబారక్ పాల్గొన్నారు.

సబ్‌జైల్‌లో సీనియర్ సివిల్ జడ్జి తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ బుధవారం జమ్మలమడుగు సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను వివరించారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం వివరించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే జమ్మలమడుగు మండల న్యాయ సేవా సమితిని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగు జడ్జి భార్గవి సబ్‌జైల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్, ఇన్‌ఛార్జి సూపరింటెండెండ్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, ఖైదీలు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మైలవరం మండల కమిటీ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ కోరారు. మైలవరం ఆటోస్టాండ్‌లో బుధవారం మే డేకు సంబంధించి కరపత్రాలను ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి గేబుసా (నన్నే)తో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 గంటల పని విధానాన్ని సాధించుకున్న రోజు గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా కార్మికులందరూ మే 1న పండుగ చేసుకుంటారని తెలిపారు. కార్మిక హక్కులను కాపాడుకోవడం కోసం సిఐటియు వారి పక్షాన నిలబడి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సురేష్, రవి పాల్గొన్నారు.

జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిని కలిసిన పాస్టర్లు

ప్రజాశక్తి - కడప

స్థానిక కలెక్టరేట్లో ఉన్న జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి హిదియాత్‌ను బుధవారం ఎపిపిఎఫ్ పాస్టర్లు కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మల్లెం విజయ భాస్కర్, గౌరవ సలహా దారులు బిషప్ కె.శామ్యూల్ బాబు, జిల్లా కార్యదర్శి ఎం.శామ్యూల్, నగర అధ్యక్షులు సుధీర్ కుమార్, నగర కార్యదర్శి కె.డేవిడ్ రాజ్, నగర జాయింట్ సెక్రెటరీ అమర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ మ్యారేజ్ లైసెన్స్ రెన్యువల్, నూతన చర్చి నిర్మాణానికి ఆర్థిక సహాయం, చర్చి పర్మిషన్, గౌరవేతనం రాని వారి విషయం క్రైస్తవ పాస్టర్ల ఇబ్బందులను గురించి జిలా అధికారికి విన్నవించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అధికారి హామీ ఇచ్చారన్నారు.

కారు, బైక్ ఢీ : ఒకరు మృతి

ప్రజాశక్తి-చిన్నమండెం

చిన్నమండెం-రాయచోటి జాతీయ ప్రధాన రహదారి పైన బుధవారం మల్లూరు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నమండెంకు చెందిన ఆఫన్(32) అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. బైక్‌లో చిన్నమండెం నుంచి రాయచోటి వైపు వెళుతున్న ఆఫన్ జాతీయ ప్రధాన రహదారిలో ఎదురుగా వస్తున్న కారు ఢీన్నట్లు తెలిపారు. ఈ ఘటనలో ఆఫన్ మృతి చెందగా, మరొక వ్యక్తి గాయపడ్డారని తెలిపారు. గాయపడిన వ్యక్తిని 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

వేంపల్లె : స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో మంగళవారం రాత్రి జరిగిన దాడిలో కత్తి శ్రీనివాసులు (50)అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. కత్తి శ్రీనివాసులుపై అదే కాలనీకి చెందిన వెంకటేష్, అంజి, రాయుడు, చిన్న దారుణంగా దాడి చేశారు. చికిత్స కోసం కడప రిమ్స్‌కు వెళ్లగా, చికిత్స పొందుతూ బుధవారం కత్తి శ్రీనివాసులు మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి బంధువుల వివరాలు మేరకు.. కత్తి శ్రీనివాసులుకు పందులున్నాయని, వాటికి ఆహారం అందించేందుకు అదే కాలనీలో ఉన్న కొత్త అంగడి వద్ద డమ్ము పెట్టుకున్నాడు. ఆ డమ్ములో ప్రజలు వేసిన అన్నం తీసుకెళ్లాడు. డమ్ము పెట్టే విషయంలో కత్తి శ్రీనువాసులుకు అదే కాలనీలో ఉన్న వెంకటేష్, అంజికి రెండు నెలలు నుండి విబేధాలున్నాయి. మృతుడికి భార్య మలేశ్వరి, ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలున్నారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు.


కత్తి శ్రీనివాసులు (ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ఆటో, ద్విచక్రవాహం ఢీ : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ శివారులోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంలోని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని వెంకటరాజంపేట దళితవాడకు చెందిన చెందిన రెడ్డిపోగు శంకర్, కృష్ణ బైక్‌పై వెళుతుండగా అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఎదురు వస్తున్న ఆటో ఢీకొన్నట్లు తెలిపారు. గాయపడిన బాధితులను స్థానికులు 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆర్‌టిసి బస్సును ఓవర్ టేక్ చేయబోయి ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం.

నిమ్మనపల్లి : బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు యువకులకు గాయాలైన సంఘటన నిమ్మనపల్లి మండలంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లి పట్టణం బాబు కాలనీకి చెందిన ఎం.అశోక్ కుమార్, వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఎం.ప్రదీప్ కలసి వారి ద్విచక్ర వాహనం నిమ్మనపల్లి మండలం తవళం పంచాయతీలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి మదనపల్లెకు వెళుతుండగా రాత్రి గం.10ల సమయంలో రాచవేటివారిపల్లి పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారి పల్లె వద్ద వారి ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిందని తెలిపారు. ఈ ప్రమాదంలో యువకులిద్దరూ తీవ్రంగా గాయపడగా స్థానికులు గమనించి 108 అంబులెన్స్ వాహనం ద్వారా మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. అక్కడ వైద్యులు గాయపడిన క్షతగాత్రులకు వైద్యం అందించి, మెరుగైన చికిత్స కోసం ఎం.ప్రదీప్ ను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా, అశోక్ కుమార్‌ను తిరుపతిలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు పొందు తున్నట్లు తెలిపారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


కలెక్టర్‌ను కలిసేందుకు వెళుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

వేంపల్లెలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- కలెక్టర్‌ను కోరిన ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉందని, దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బుధవారం కలెక్టర్‌ను కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను ఎంపీ, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి కలిశారు. వేంపల్లె పంచాయతీకి కార్యదర్శిని నియమించాలని వినతిపత్రం అందజేశారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ వెంటనే డిపిఒకు ఫోన్ చేసి వేంపల్లెలో మూడు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ పెట్టి చెత్తను తొలగించేందుకు పారిశుధ్య పనులు చేయించాలని ఆదేశిం చారు. వేంపల్లె పంచాయతీకి కొత్త ఇఒ కూడా వస్తారని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఎంపీ వెంట ఎంపిటిసి రహంతుల్లా ఖాన్ పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల 986-91 సంవత్సరంలో విద్యనభ్యసించిన విద్యార్థులు బుధవారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులను ఊరేగింపుగా తీసుకొచ్చారు. పాత జ్ఞాపకాలను స్మరించుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. గురువులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. 34ఏళ్ల తర్వాత విద్యార్థులు కలుసుకుని ఆనందంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలరించుకున్నారు. పాఠశాలకు గుర్తుగా 50 కుర్చీలు, రూ.25 వేలు నగదు పూర్వ విద్యార్థులు వితరణ చేశారు.

ఏడు టన్నుల పశువుల దాణా మంజూరు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పాడి రైతుల కోసం ప్రభుత్వం ఏడు టన్నుల పశువుల దాణా మంజూరు చేసిందని మండల పశు వైద్యాధికారి మహమ్మద్ గౌస్ తెలిపారు. 140 బస్తాల పశువుల దాణాను చాపాడు, చిన్నగురవలూరు, వెదురూరు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. 50 కిలోల బస్తా 50శాతం రాయితీతో రైతులు రూ.555 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవసరమైన రైతులు పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

3న స్పిరిట్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-కడప అర్బన్

రిమ్స్ రోడ్డులో ఉన్న స్పిరిట్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ఎం.సి.రవీంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కంపెనీలకు సంబంధించి 10వ తరగతి, డిగ్రీ చదివిన విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు ఈ నెల 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రాంగణ ఎంపికలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు విద్యార్థులు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాంగణ ఎంపికలకు హాజరుకావాలని పేర్కొన్నారు. కడప కొప్పర్తి ఇండస్ట్రియల్ ఏరియాలోని ఛానల్ ప్లే లిమిటెడ్ కంపెనీ వారు అసెంబ్లీ లైన్ ఆపరేటర్ ఉద్యోగాలు, వివిధ హెూదాలకు సంబంధించిన ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలు హాజరయ్యే వారు పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకుని 18 సంవత్సరాల నుంచి 31 సంవత్సరాల వయసు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఈ ఎంపికలకు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజులు లేవని తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే వారు బయోడేటా, అర్హత పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ తమ వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలను 98852 50955, 955030 3077 సంప్రదించాలని తెలిపారు.

రిమ్స్‌కు యుసిఐఎల్ విరాళం

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మౌలిక సదుపాయాలు కల్పన, పరికరాల కొనుగోలు కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)నిధుల కింద రూ.53.67 లక్షల విరాళం చెక్కును బుధవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీసులో యుసిఐఎల్ డైరెక్టర్ (టెక్నికల్) మనోజ్ కుమార్, జనరల్ మేనేజర్ (మిల్) సుమన్ సర్కార్, ప్రతినిధులు యురేనియం కార్పోరేషన్ లిమిటెడ్ అధికారులు కలెక్టర్ శ్రీధర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేముల మండలం తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు అందజేసిన నిధులతో రిమ్స్‌లో ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్స్, ఒబిజి గైనిక్ ఇఎన్‌టి, రేడియాలజీ అనిష్టిసియా డిపార్ట్మెంట్స్‌లలో పరికరాల కొనుగోలుకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఆకాంక్షిత జిల్లా అభివృద్ధిలో భాగంగా ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనలకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

సేవలు చిరస్మరణీయం : ఎస్‌పి

కడప అర్బన్ : సుదీర్ఘకాలం పోలీసు శాఖకు విశేష సేవలందించి ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమని ఎస్‌పి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగ విరమణ పొందిన ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.పర్వీన్, ఎస్‌సి, ఎస్‌టి సెల్ ఎఎస్ఐ ఎస్.జయశంకర్, డిఎస్‌బి ఎస్ఐ ఎస్.శ్రీనివాసులును ఎస్‌పి శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందచేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్‌బి డిఎస్‌పి ఎన్.సుధాకర్, ఎఆర్ డిఎస్‌పి కె.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐ దారెడ్డి భాస్కర్‌రెడ్డి, డిసిఆర్‌బి సిఐ ఈశ్వర్ రెడ్డి, ఆర్ఐ వీరేష్, శివరాముడు, డిపిఒ ఎఒ జ్యోతి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో చదువుకుంటున్న విద్యార్థులు

నీతి పుస్తకాలు చదవడం ఎంతో ఉపయోగకరం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యార్థులు నీతి పుస్తకాలు చదవడం ఎంతో ఉపయోగకరమని కోరగుంటపల్లె గ్రంధాలయ అధికారి గంగాదేవి పేర్కొన్నారు. బుధవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు మంచి అలవాట్లను, గురువులను గౌరవిండం ఎలా అంశాలను వివరించారు. నీతి కథలను చదవడం ద్వారా ఎన్నో కొత్త అంశాలు తెలుస్తాయన్నారు. అనంతరం పిల్లలు ఆటలతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని ధయాంఖాన్ పల్లె టిడిపి నాయకులు, వ్యాపార వేత్త గడ్డం గంగినాయుడు తన కుమారుడు గడ్డం పోతన్న ప్రకాష్ జన్మదినం సందర్భంగా శ్రీవెంకటలక్ష్మి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిరాశ్రయులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కోన ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నిరాశ్రయుల ఆకలి తీర్చడం కోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకొస్తుండడం సంతోష కరమన్నారు. వేడుక పేరిట డబ్బులు వృథా చేయకుండా నిరాశ్రయుల ఆకలి తీర్చడం కోసం అన్న ప్రసాద వితరణ దాత గంగి నాయుడు ముందుకు రావడం హర్షనీయమన్నారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - వేంపల్లె

పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఐటిఐలో సాంకేతిక విద్య పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని కందుల ఓబుల్‌రెడ్డి ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు తెలిపారు. బుధవారం వేంపల్లె ఐటిఐలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఉద్యోగ అవకాశాలు లేక ఎంతోమంది నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పదో తరగతి తర్వాత ఉద్యోగ భద్రత, ఉపాధి కోసం ఏమి చదివితే బాగుంటుందనే అవగాహన లేకపోవడమే అన్నారు. ఈ పరిస్థితుల్లో 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఐటిఐ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎన్నో కంపెనీలు ఐటిఐ చదివిన అభ్యర్థులు లేక కంపెనీలను తగినంత సామర్థ్యంతో నడపలేక పోతున్నారని తెలిపారు. ఐటిఐ చదివిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వాలు ముందుకు వస్తున్నట్లు చెప్పారు. ఆయా కంపెనీలు కూడా ఐటిఐ చదివిన విద్యార్థుల కోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. చదువు పూర్తయిన వెంటనే ఉపాధి దొరకాలంటే ఐటిఐ పూర్తి చేయాలని ఆయన సూచించారు.

3న సింహాద్రిపురంలో పెద్దమ్మతల్లి దేవర

ప్రజాశక్తి - సింహాద్రిపురం



సింహాద్రిపురంలోని శ్రీపెద్దమ్మతల్లి దేవర మహోత్స వాన్ని ఈనెల 3న అంగరంగ వైభవంగా నిర్వహిం చనున్నారు. ఆ మేరకు నిర్వాహకులు భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. 3న ఉదయం నుంచి పెద్దమ్మ అమ్మవారుకు ప్రత్యేక పూజలు నిర్వహిం చనున్నారు. మధ్యాహ్నం నుంచి పాత వివేకా నంద పాఠశాల ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం బుడ్డయ్యపాలెం నుంచి అమ్మవారిని పుర వీధుల్లో గ్రామోత్సవం చేయనున్నారు. రాత్రి 12 గంటలకు అమ్మ వారికి బోనాల సమర్పణ, అనంతరం భక్తులు తమ మొక్కు బడు లను తీర్చుకొనున్నారు. 4న కొత్తూరు శ్రీచౌడేశ్వరి దేవి జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహిం చనున్నారు. **80ఏళ్ల తర్వాత దేవర..** సింహాద్రిపురంలో దాదాపు 80 ఏళ్ల తర్వాత దేవర ఏర్పాటుకు గ్రామస్తులు సంక ల్పించారు. చాలా ఏళ్ల తర్వాత దేవర జరుగు తున్నందున గ్రామస్తులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కార్యక్ర మాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

మ్యూజియాన్ని అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మైలవరం మండలంలో చరిత్ర కలిగిన మ్యూజియాన్ని పురావస్తు శాఖ అధికారులు అభివృద్ధి చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విరణాల శివకుమార్ తెలిపారు. బుధవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మైలవరం మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మ్యూజియం నేడు మూత పడడం చాలా బాధాకరమన్నారు. రేపటి తరానికి గత చరిత్ర ఆనవాళ్లు ఈ మ్యూజియం సందర్శన అన్నారు. మ్యూజియంలో ఉన్న కత్తులు, నాణేలు ఇతర వాటి చరిత్ర తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో మ్యూజియం అధ్వానంగా తయారైందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యూజియానికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకుల లక్ష్మీనారాయణ, దాసు పాల్గొన్నారు.



దెబ్బతిన్న మ్యూజియంను చూపిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నదే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అమరావతితోపాటు రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనేదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి అమరావతికి వస్తున్న సందర్భంగా నియోజకవర్గంలోని కార్యకర్తలు అమరావతికి రావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ ఇద్దరూ బాబాయి అబ్బాయిలమని మాపై విమర్శిస్తున్నారు. సోలార్ భూములను ఆక్రమించామని ఆరోపిస్తున్నారు. వీటిపై ముఖ్యమంత్రి, ప్రభుత్వ పెద్దలతో చర్చించామన్నారు. తాను ఎక్కడైనా అవినీతికి, తప్పునకుగానీ పాల్పడినట్లు తేలితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తామని పేర్కొన్నారు. కేవలం పార్టీ సభ్యత్వంతో మాత్రమే ఉంటా నన్నారు. పి.రామసుబ్బారెడ్డి ఎప్పుడూ వెఎస్ కుటుంబానికి వ్యతిరేక మన్నారు. ఇప్పుడు వైసిపిలో ఉంటూ తమప విమర్శలు చేయడ మేంటని ఎమ్మెల్యే ప్రశ్నించారు. టిడిపి మండల అధ్యక్షులు యూత్ నాగేశ్వర్రెడ్డి, నాయకులు గోన పురుషోత్తం రెడ్డి, అంగడి శివ పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఎర్రగుంట్ల : ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మహిళలను కోరారు. బుధవారం హెవెన్ డోర్స్ రెస్టారెంట్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలపాటు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, మండల ఇన్‌ఛార్జి మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషఫణి, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగరాజు, టిడిపి నాయకులు మోహన్‌రెడ్డి, కత్తి ప్రతాపరెడ్డి, చిన్న సేటు, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



పాకిస్తాన్ జాతీయ పతాకాన్ని దగ్ధం చేస్తున్న ముస్లింలు

ఉగ్రవాదులపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలని వైసిపి రాష్ట్ర మైనారిటీ అధికారి సెక్రెటరీ ముల్లా జానీ పేర్కొన్నారు. స్థానిక జామియా పీఠాధిపతి సాధిక్ బాషా ఖాద్రి నేతృత్వంలో బుధవారం ముల్లా జానీ ముస్లింలతో కలిసి పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను పట్టుకొని నినాదాలు చేశారు. పాకి స్తాన్ జాతీయ పతాకాన్ని దగ్ధం చేశారు. అనంతరం జానీ మాట్లా డుతూ ఉగ్ర వాదుల దాడి బాధాకరమన్నారు. అన్ని మతాల వారు భారత దేశంలో సోదర భావంతో మెలుగుతున్నారని తెలిపారు. భారత దేశంలో పుట్టాం, ఇక్కడే చస్తామని తెలిపారు. అవసరమైతే మిలటరిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పర్యాటకులను హిందువులా అని అడిగి కాల్చి చంపడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



అర్హత పత్రాలు అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. బుధవారం పట్టణంలోని మెప్మా కార్యాలయం వద్ద ఆదిత్య బిర్లా కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెప్మా అధికారులు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళా ప్రత్యేకించి మహిళల కోసమేనని తెఇపారు. అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టైలరింగ్‌కు సంబంధించిన నిరక్షరాశులతోపాటు ఐదవ తరగతి నుంచి డిగ్రీ చదివిన మహిళలు కూడా పాల్గొని వారి అర్హతలను బట్టి ఉపాధిని పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో 185 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 150 మంది ఎంపికయ్యారు. మెప్మా అధికారి సిఎంఎం హరిప్రసాద్, రామాం జనేయులు, నాగలక్ష్మి, ఆదిత్య బిర్లా కంపెనీ ప్రతినిధులు జయకుమార్, ప్రభాకర్, కిరణ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - వేముల

స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో కిశోర వికాసం మండల స్థాయి కన్వెర్జెన్సీ సమావేశం ఎంపిడిఒ లోకేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాలబాలికల హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ కిశోర వికాసం కార్యక్రమంలో కౌమార దశలో ఉన్న బాలికల హక్కుల రక్షణ కోసం, విద్యకు మద్దతు ఇవ్వడం, పరస్పరం సాధికారత, మంచి ఆరోగ్యం పోషకాలపై అవగాహనా కల్పించడం, లైంగిక పునరుత్పత్తి, భద్రత, మూఢనమ్మకాలు, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హసీనా ఇఒపిఆర్‌డి పద్మావతి, పోలీస్, పంచాయతీరాజ్, గ్రామీణ శాఖ, ఐసిడిఎస్, డిఆర్‌డిఎ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అధికారులు



దుకాణంలో సందడి చేస్తున్న మెహరీన్

మదనపల్లెలో హీరోయిన్ మెహరీన్ సందడి

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఎమ్మెడి సిల్వర్ జువెలరీ షాప్‌ను రాజాది గ్రేట్ సినిమా ఫేమ్, హీరోయిన్ మెహరీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మదనపల్లెకు వచ్చిన మెహరీన్‌ను చూసేందుకు పట్టణ ప్రజలు ఆసక్తిని కనబరిచారు. అక్షయ తృతీయ రోజున జువెలరీ షాప్‌ను ప్రారంభించిన మెహరీన్ కాసేపు సందడి చేసి ఇక్కడ ప్రజలను అలరించారు. రిబ్బన్ కటింగ్, జ్యోతి ప్రజ్వలన అనంతరం షాపులోని వివిధ డిజైన్ లలోని నగలను తిలకించారు. 50 వేలకు పైగా డిజైన్లతో ఎమ్మెడిలో వెండి నగలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు వీటిని కొనుగోలు చేసి కొత్తదనాన్ని ఆస్వాదించాలని కోరారు. మొదటి రోజు ఈ షాపులో అనేక ఆఫర్లు పెట్టడంతో పట్టణ ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు. మొదటిసారి మదనపల్లె కు రావడం ఎంతో సంతోషంగా ఉందని, మదనపల్లె ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని మరవలేమని తెలిపారు. కార్యక్రమంలో షాపు నిర్వాహకులు రమేష్ ఎమ్మెడి పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో మండలాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కలికిరి :

ఎంపీ నిధులతో మండల అభివృద్ధికి కృషి చేయాలని మండల వైసిపి నాయకులను ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఎంపీ తిరుపతి నుంచి సిటిఎం కు వెళుతుండగా మార్గమధ్యలో కలికిరి క్రాస్ రోడ్ వద్ద నియోజకవర్గం సమాచారం హక్కు చట్టం అధ్యక్షుడు మద్దిరాల్ల మల్లికార్జున ఆధ్వర్యంలో వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అక్కడికి వచ్చిన వైసిపి నాయకులను పలుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీ నిధు లను మండల అభి వృద్ధికి ఖర్చు చేసే విధంగా చూడాలని, మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజా సమ స్యలు పరిష్కరించడానికి నాయకులంతా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వేం పల్లి బాలాజీ, వేంపల్లి ఫయాజ్, ఖాదర్బాషా, మాజీ సర్పంచ్ వెంకటపతి పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి హంగామా

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప బాలోత్సవ కమిటీ అధ్వర్యంలో వేసవి హంగామా పేరుతో ఒకటవ తేదీ నుంచి 31 వరకు నెల రోజుల పాటు వేసవి సెలవుల్లో 6వ తరగతి నుండి 10వ తరగతి చదువుచున్న పిల్లలకు ఆడుతూ, పాడుతూ, ఆహ్లాదంగా, ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉండుటకు వీలుగా వినోద కార్యక్రమాలను రూపొందించిందని బాలోత్సవకమిటీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగము నిరెడ్డి, అధ్యక్షులు గుర్రాల గోపాల్ తెలిపారు. బుధవారం ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో కమిటీ సమావేశం నిర్వహించారు. కడప మునిసిపల్ మెయిన్ స్కూల్‌లో ఉదయం 8.30 గంటలకు డిఇఒ షంషుద్దీన్ ప్రారంభిస్తారని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి, విశేష అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, పిల్లల శ్రేయస్సు కోరుకునే పుర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

మేడేకు విస్తృత ఏర్పాట్లు : సిఐటియు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మేడేని ఘనంగా నిర్వహించుకునేందుకు సిఐటియు నాయకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు సిఐటియు జెండాను ఎగరవేసేందుకు గత వారం రోజులుగా తగు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో అడుగడుగునా అవాంతరాలు ఎదురయ్యాయి. ఇక్కడ సిఐటియు జెండా ఎగరవేసేందుకు ఒప్పుకునేది లేదంటూ ఒకానొక దశలో దాడులకు తెగబడ్డారు. అయినా పట్టువదలని కార్మికులు సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ఇచ్చిన భరోసాతో సిఐటియు అనుబంధ సంస్థల నాయకుల అండతో స్థానిక మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మున్సిపల్ చైర్ పర్సన్ మనూజరెడ్డిలను కలిసి మే డే వేడుకలకు ఆహ్వానించారు. సిఐటియు జెండా ఎగుర వేసేందుకు బుధవారం మున్సిపల్ కార్యాలయం ముందు సిమెంట్ దిమ్మెను ఏర్పాటు చేశారు. అన్ని డివిజన్ల వద్ద, మస్టర్ పాయింట్ల వద్ద సిఐటియు జెండా ను ఎగురవేస్తామని తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ళ బెంగుళూరు బస్టాండ్, చిత్తూరు బస్టాండ్, టౌన్ బ్యాంక్ సర్కిల్, నీరుగట్టువారిపల్లె, ఎన్టీఆర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో సిఐటియు తోరణాలను కట్టారు. ప్రతీ కార్మికుడు, పట్టణ ప్రజలు గురువారం జరిగే మే డే వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో సిపిఎం జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు, సిఐటియు అనుబంధ సంఘ నాయకులు రామకృష్ణ, గోపాల్, సాంబశివ, ఐటియుసి నాయకులు జి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బాలకృష్ణ సేవలు అభినందనీయం : ఎడి



బాలకృష్ణను సన్మానిస్తున్న ఎడి, సిబ్బంది

ప్రజాశక్తి-కడప అర్బన్

చేనేత, జౌళి శాఖలో 21 సంవత్సరాల పాటు ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేసిన బాలకృష్ణ సేవలు అభినందనీయమని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు, బి.పిచ్చేశ్వరరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని డిబ్లాక్‌లోని కార్యాలయంలో బాలకృష్ణ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. బాలకృష్ణ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ విధులను అంకితభావంతో నిర్వహించి. ఉన్నత ఉద్యోగుల, సహోద్యోగుల, పలువురి మన్ననలు పొందారాని చెప్పారు. బాలకృష్ణ సౌమ్యుడు, శాంతి స్వభావి, స్నేహశీలి, నిబద్ధత, క్రమశిక్షణ పాటిస్తూ అందరి మన్ననల పొందారని పేర్కొన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి, అధికారులు, సొసైటీ అధ్యక్షులు బంధుమిత్రులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ అభివృద్ధి అధికారులు ఎస్.అహమ్మద్ మొహిద్దిన్, పి.నారాయణమ్మ, సహాయ అభివృద్ధి అధికారులు, పి.వి.శేషగిరిరావు, ఎం.రవి ప్రకాశ్‌రెడ్డి, ఆర్.వనిత, కె.పృథ్వీరాజ్, సబార్డినేటర్స్, బి.జయరాం, ఈశ్వరమ్మ, రాయచోటి ఇన్చార్జి ఎడిఆర్.పవన్ కుమార్‌రెడ్డి, ఎడిఒలు, జి.వెంకట పవన్ కుమార్, ప్రవీణ్, అనంతపురం అభివృద్ధి అధికారి ఎస్.బసవరాజు, సహాయ అభివృద్ధి అధికారులు, పి.మురళీమోహన్, పి.వెంకట సుబ్బ నాయుడు, ఆప్కో ఎఎంఒ బి.గోపాల్, సొసైటీ ప్రెసిడెంట్లు, జగదీశ్వర ప్రసాద్, కంచన శివప్రసాద్, బండి మురళి, కేతినేని శివ, బండి సుబ్బయ్య, ఉప్పు శివ పాల్గొన్నారు.

హజ్ హౌస్‌ను ఉపయోగంలోనికి తీసుకురండి



వినతి పత్రం అందజేస్తున్న సలావుద్దీన్

- ముస్లిం సమైక్య రాష్ట్ర అధ్యక్షులు సలావుద్దీన్

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఆంధ్రప్రదేశ్ హజ్ హౌస్‌ను ఉపయోగంలోక తీసుకురావాలని ముస్లిం సమైక్య రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. బుధవారం జిల్లా మైనారిటీ అధికారి షేక్ హిదయతుల్లాకు హజ్ హౌస్ పరిరక్షణ యూత్ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ హజ్ హౌస్ పరిసరాలను శుభ్రపరిచి నీటి సౌకర్యం, విద్యుత్, భద్రత చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో హాజీలకు పవిత్ర హజ్ సేవలు అందుబాటులో తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం పైన ఒత్తిడి తేవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్, ఎపి హజ్ హౌస్ పరిరక్షణ యూత్ కమిటీ అధ్యక్షుడు షేక్ జహీరుద్దీన్, ఖూన్ కా రిష్తా చైర్మన్ తారీఖ్ అలీ, హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు ఇబ్రహీం, మైదుకూరు ముస్లిం సేవా సంఘం వ్యవ స్థాపక అధ్యక్షుడు అన్వర్ బాషా, సభ్యులు పర్వేజ్, నవాజ్, షబ్బీర్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఏదీ? : కాంగ్రెస్

ప్రజాశక్తి-కడప

ప్రజల ఆరోగ్యం కాపాడుతామని ప్రజారోగ్యం, చికిత్సలకు ప్రాధాన్య మిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ అబద్ధాలు ప్రచారం చేసుకుంటున్నారని పిసిసి ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ఆరోపించారు. బుధవారం జిల్లా ఔషధ నియంత్రణ అసిస్టెంట్ డైరెక్టర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కఠిన చర్యల వల్ల సరైన ఔషధాలు రోగులకు లభించకపోవడంతో రోగుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో కొన్ని ప్రత్యేక ఔషధాలు దుర్వినియోగం పేరిట కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల పర్యవసానంగా నిజమైన రోగులు మందులు అందుబాటులో లేక నరకం అనుభవిస్తున్నారని తెలిపారు. సంవత్సరాల తరబడి దీర్ఘకాలికంగా వినియోగిస్తున్న రోగులకు ఆయా మందులు లభించక, ఏం చేయాలో పాలు పోక మందులు అందుబాటులో లేకపోవడంతో వారి ప్రాణాలకు తీవ్రముప్పు ఏర్పడినట్లు ఆరోపించారు. ప్రభుత్వం, ఔషధ నియంత్రణ శాఖ నిజమైన రోగులకు సంబంధిత ఔషధాలు అందుబాటులో తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఒబిసి జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్‌బాషా, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి భువన ఏకాదశిరెడ్డి పాల్గొన్నారు.



కడప: శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ, జెవివి నాయకులు

ఘనంగా శ్రీశ్రీ జయంతి

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా శ్రీ శ్రీ జయంతి వేడుకలు నిర్వహించారు. బుధవారం శ్రీ శ్రీ చిత్రపటానికి గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అభివృద్ధి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా కవి శ్రీశ్రీ రచించిన గీతాలను, కవితలను ఇప్పటికీ ప్రజలు గుర్తించుకుంటున్నారని పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు షామీర్‌బాషా మాటాడుతూ శ్రీశ్రీ రచిన మహాప్రస్థానం లోని కవితలు ఈ సమాజంలోని యువతను నేటికీ చైతన్యం పరుస్తున్నాయని తెలిపారు. సినిమాలో అయన రచించిన అల్లూరి సీతారామరాజు అనే చలన చిత్రంలో తెలుగు వీర లేవరా అని గీతాన్ని రచించి ప్రజల హృదయాలలో ఎంతో గొప్ప వ్యక్తిగా పేరు సంపాదించుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసచారి, లైబ్రేరియన్ రాజ్ కుమార్, సుబ్రహ్మణ్యం, గ్రంథాలయ సిబ్బంది గౌస్ సుబ్బమ్మ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు 116వ జయంతి వేడుకలు తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, రాజంపేట మండల శాఖ అధ్యక్షులు బొట్టా రామచంద్రయ్య నాయుడు, ఉపాధ్యక్షులు బి.వి.నారాయణ రాజులు పట్టణంలోని జవుళీ బజారులో గల శ్రీ సరస్వతీ విద్యా మందిరంలో ఈ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవాధ్యక్షులు తుంగా వెంకటరమణారెడ్డి, విద్యార్థులు ప్రియాంక, ఉష, జాగృతి పాల్గొన్నారు.

తాగునీటి ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి- కలకడ

ఎన్‌టిఆర్ సుజల స్రవంతి సురక్షిత తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ సంత గేటులో మరమ్మతుకురైన వాటర్ ప్లాంటును మరమ్మతు చేసి తాగునీరు అందించడానికి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో సిఎం చంద్రబాబు ప్లాంట్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. అది మరమ్మతు గురైన గత ప్రభుత్వంలో మరమ్మతులు చేయకుండా వదిలేశారని అన్నారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశానుసారం కలకడ సర్పంచ్ ప్యారిజాన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి సురక్షిత మంచినీటి పథకం ద్వారా ప్లాంట్ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.



సత్కారం అందుకుంటున్న గాజుల లక్ష్మీదేవి

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి- రాజంపేట అర్బన్

ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని రోడ్లు, భవనాల శాఖ ఇఇ సహదేవ్‌రెడ్డి అన్నారు. కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొం దిన గాజుల లక్ష్మీదేవిని ఇఇ , కార్యాలయ సిబ్బంది ఉద్యోగ విరమణసభలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సహదేవరెడ్డి మాట్లాడుతూ తమ శాఖలో సుమారు 34 ఏళ్ల పాటు సబార్డినేట్‌గా సేవలందించి అలాంటి కలంకం లేకుండా ఉద్యోగ విరమణ పొందిన లక్ష్మీదేవి మిగిలిన సిబ్బందికి ఆద ర్శప్రాయమని కొనియాడారు. విశ్రాంత ఉద్యోగిగా ఆమె సం పూర్ణ జీవితం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు. తెలుగు పండితులు, కవి గంగనపల్లి వెంకటరమణ మాట్లాడుతూ నిరాడంబరత, కలుపుగోలు వ్యక్తిత్వంతో గాజుల లక్ష్మీదేవి తన 34 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ప్రతి ఒక్కరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ కార్యాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

వీరబల్లి : విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరని ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెం ట్‌గా పని చేస్తున్న వరలక్ష్మి బుధవారం ఉద్యోగ విరమణ చెందారు. ఆమెకు మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి రాజేంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎంపిడిఒ ఆఫీసులో సీనియర్ అసి స్టెంట్ గా పనిచేసిన వరలక్ష్మి తనకు కేటాయించిన విధుల పట్ల నిబద్ధతో పనిచేశారని, , మండల సిబ్బందితో స్నేహభావంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించేలా పర్యవేక్షిం చార న్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం సిబ్బందితో ఆయన వరలక్ష్మికి దుశ్శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల డెవలప్మెంట్ అది కారిని నూర్జహాన్, జడ్‌పిటిసి మెంబర్ శివరాంగౌడ్, మండల పరిరక్షణ అధికారి రామచంద్రారెడ్డి, పంచాయతీ సెక్రటరీ చంద్రుడు, పద్మజ, సంజీవరెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

శ్మశానాన్ని ఆక్రమణ నుంచి కాపాడాలి

- తహాశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కబ్జాదారుల నుంచి శ్మశాన స్థలాలు కాపాడాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం వేంపల్లి గ్రామ పరిధిలోని కన్నెమ డుగు వారిపల్లి, దిగువ కొనకుంట్లవారిపల్లి, ఎగువ కొనకుంట్లవారిపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు తమ శ్మశాన భూమిని కబ్జా చేయడాన్ని నిరసిస్తూ తహాశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి తాము మేటిగడ్డ కాలువలో శ్మశానాన్ని ఏర్పాటు చేసుకొని మృతి చెందిన తమ కుటుంబ సభ్యులను అక్కడే సమాధి చేసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల కొంతమంది రియల్టర్లు శ్మశానానికి అనుకున్న ప్రయివేట్ భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వ స్థలాన్ని, శ్మశానాన్ని ఆక్రమించుకొని దౌర్జన్యంగా కబ్జా చేశారని అన్నారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ రియల్టర్లు రెచ్చిపోయి ప్రభుత్వ స్థలాలు, స్మశానవాటికలు ఆక్రమించుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వ స్థలాలను, స్మశానవాటికలను రక్షించాలని కోరారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బాబ్జి కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఐటియుసి నాయకులు కృష్ణమూర్తి, గ్రామ స్తులు రవికుమార్, రాజా నాయుడు, శివ, భాస్కర్, నారాయణ, శివశంకర్, ప్రశాంత్, రెడ్డప్ప, రాజన్న, రామ్మూర్తి, చంద్రశేఖర్, రవి, నారాయణ, లక్ష్మీదేవి, శారదమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

మామిడి తోటను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-కలకడ

ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్ర బాబు, జిల్లా పరిశ్రమల కార్పొరేషన్ జనరల్ మేనేజర్ కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం మండలం కోన గ్రామంలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగువుతున్న మామిడి తోటను పరిశీలించారు. వ్యవసాయ శాఖలో ఎఇఒగా తిరుపతిలో పనిచేస్తున్న కోన గ్రామానికి చెందిన విశ్వనాథ్ తనకున్న 16 ఎకరాల్లో మామిడి తోటను సాగుచే స్తున్నారు. గతంలో రసాయనిక పద్ధతుల్లో తోటను సాగు చేయ గా ఈ ఏడాది పీలేరుకు చెందిన ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణులు బోదేషావలి ప్రోత్సాహంతో పూర్తిగా ప్రకృతి వ్యవ సాయ పద్ధతుల్లో తన తోటను సాగు చేసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి, జిల్లా పరి శ్రమల కార్పొరేషన్ జనరల్ మేనేజర్ పరిశీలించారు. ప్రస్తుతం తోటలో చేపట్టిన యాజమాన్య పద్ధతులు, వాడుతున్న కషా



మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

యాలు, వాటి తయారీ, పిచికారి, అవుతున్న ఖర్చు, రసాయనిక ఎరువులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో గమనించిన తేడాలు, పెట్టుబడుల ఖర్చు వంటి విషయాలను వారు విశ్వనాథ్ ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీలేరు హెచ్ఎ సుకుమార్ రెడ్డి, విహెచ్ఎ అక్రమ్ బాషా పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి : కమిషనర్



అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న కమిషన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- రాజంపేట అర్బన్

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని అన్న క్యాంటీన్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసిన పలు రకాల వస్తువులు, ఆహార పదార్థాలు ప్రదర్శనగా ఉంచడం జరిగిందని తెలిపారు. మహిళలు స్వయంగా తయారు చేసిన వస్తువులను ఆయన కొనుగోలు చేసి వారిని అభినం దించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ మహిళలు పొదుపు సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారాలు చేసుకుంటూ స్వయం శక్తితో ఎదగాలని సూచించారు. మహిళలు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం మెప్మా లోని పొదుపు సంఘాల మహిళలకు పూర్తి సహకారాన్ని అందిస్తోందని వివరిం చారు. తక్కువ ధరలకే నాణ్యమైన డబ్బులు ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయించడం సంతోషదాయకమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రమౌళి, ఎం. వెంకటేశ్వర్లు, మెప్మా సిఎంఎండి అయవారయ్య, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఎ.వెంకటకళ్యాణ్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు టీ.సాయిసుశీల, బి.వర లక్ష్మి, ఆత్మీయులు పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న రైడ్ సభ్యులు

ప్రజాశక్తి-గాలివీడు

వెలిగల్లు గ్రామంలో జమియా మసీదులో బుధవారం రైడ్స్ సంస్థ సిఎస్‌డబ్లు భారతమ్మ ఆధ్వ ర్యంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ముస్లిం మత పెద్ద లు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల శారీరకంగా, మానసిక ఇబ్బందులు గురవుతారని అన్నారు. కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందన్నారు. ఆడపిల్లలకు 18సంవత్సరాలు నిండిన తర్వాత, మగపిల్లలకు 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాత వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలను ప్రొత్సహిస్తే తల్లితండ్రులు, బంధు వులపై కేసు నమోదు చేస్తామని, రెండు సంవత్సరాలు జైలుశిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధి స్తారని తెలిపారు. తల్లిదండ్రులు అవగాహన కలిగి పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలని సూచించారు. మీ చుట్టు ప్రక్కల ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ కి తెలియజేయాలని తెలిపారు. అనంతరం అందరిచేత బాల్య వివాహ రహిత ప్రతిజ్ఞ చేయించారు.

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక శ్రీ టిఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల ప్రభుత్వ ఐటిఐ లో అడ్మిషన్ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రిషన్, సివిల్ ట్రేడ్లలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు పదవతరగతి, ఇంటర్మీడియట్ పాస్ లేక ఫెయిల్ అయిన అభ్యర్థులు ఈనెల 24 వ తేదీ సాయంత్రం 5 గంట లోపు ఆన్‌లైన్‌లో iti.ap.gov.Inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ధరఖాస్తు చేసుకున్న అనంతరం అభ్యర్థులు ఏదేని ప్రభుత్వ ఐటిఐలలోని ప్రిన్సిపల్ (వెరిఫికేషన్ ఆఫీసర్) వద్దకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని రిజిస్ట్రేషన్ ఫారం లో చూపిన షెడ్యూల్ ప్రకారం 24-05-2025 నుంచి 26-05-2025వ తేదీ వరకు వెరిఫికేషన్ చేయిం చుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించుకోని యెడల ధరఖాస్తులు ఆమోదించబడదని తెలిపారు.

మురళికి వాణిజ్య శాస్త్రంలో డాక్టరేట్

ప్రజాశక్తి-కడప అర్బన్



డాక్టర్ పొందిన మురళి

అనంతపురం జిల్లాలో చేనేత కార్మికుల జీవితాలపై అధ్యయనం చేసిన యోగి వేమన యూనివర్శిటీ వాణిజ్య శాస్త్ర విభాగ రీసెర్చ్ స్కాలర్ ఎం.మురళికి డాక్టరేట్ లభించింది. 'ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో చేనేత కార్మికుల సంక్లిష్టత, సవాళ్ల అన్వేణ-ఒక అధ్యయనం అనే అంశంపై వాణిజ్య శాస్త్ర శాఖ ప్రొఫెసర్ ఎస్.రఘు నాథరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి విశ్వవిద్యాలయానికి సమర్పించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సిలబస్ అనుసరించి బీకాం బిబిఎ విద్యార్థుల కోసం వివిధ టెక్స్ట్ బుక్‌లలో 8 అధ్యాయాలను ఈయన రాశారు. మురళి రాసిన పరిశోధన పత్రాలు ప్రసిద్ధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురి తమయ్యాయి.

ఎస్‌టి గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా పరిధిలో గల గిరిజన గురుకుల బాలుర పాఠశాలలు రాయచోటి, టి.సుండుపల్లి, పీలేరు, తంబళ్లపల్లి, మదనపల్లిలోని గిరిజన గురుకుల పాఠశాలలో 3వ తరగతి, మిగతా తరగతుల బ్యాక్‌లాగ్ ఖాళీలను నింపుటకు దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి డి.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 01-05-2025 నుంచి 20-05-2025 వరకు దరఖాస్తులు స్వీకరించనున్న ట్లు తెలిపారు. 3వతరగతిలో ఎస్‌సి-04, ఎస్‌టి-32, బిసి-2, ఒసి- 1,ఎక్యూ -1 మొత్తం 40 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. బ్యాక్ లాగ్ ఖాళీలకు ఎస్‌టి విద్యార్థులకు మాత్రమే అవకాశం కలదని అన్నారు. వివరాలకు ఆయా పాఠశాలలకు సంబంధించిన ప్రధానాచార్యులు మొబైల్ నెంబర్లకు సంప్రదించవలెను అని తెలిపారు. సుండుపల్లె బాలుర 9441146908, 9866624837, రాయచోటి బాలురు 9963589311, 8142585783, 9676293501, పీలేరు బాలురు 9441494161, 9505336767, తంబళ్లపల్లె బాలుర 9490601554, 9000242717. మదనపల్లి బాలుర 9490601554, 8985460085 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. జిల్లాలోని ఆయా ప్రదేశాలకు దగ్గరగా ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రామాపురం : ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా మండ లానికి మూడు ఆటో యూనిట్లు మంజూ రైనట్లు ఎంపిడిఒ జాషువా పేర్కొన్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలోని ఆసక్తి గల ఎస్‌సి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని ఎస్‌బిఐ, ఎపిజిబి, యూని యన్ బ్యాంక్‌ల ద్వారా మూడు యూనిట్లు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. బ్యాంకు రూ.లక్ష, ప్రభుత్వ సబ్సిడీ రూ.1.8లక్షలు, లబ్ధిదారుని వాటా కింద రూ.15వేలు మొత్తం రూ.3లక్షలు రుణం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు OBMMS పోర్టల్‌లో ధ్రువీకరణ పత్రాలను జతపరిచి ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ముస్తఫా హజరత్ మృతి బాధాకరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలికిరి : నల్లారి కుటుంబ వీరాభిమాని, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, జమాయత్ ఉల్మాయేహింద్ జిల్లా సెక్రెటరీ ముస్తఫా హజరత్ మృతి చెందడం బాధా కరమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమా రొరెడ్డి అన్నారు. ఆయన బుధవారం ఉదయం ముస్తఫా హజరత్ పార్థివ దేహానికి చూసి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సీనియర్ కార్యకర్తను కోల్పోయా మంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలపట్ల ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రంరెడ్డి మైనార్టీ నాయ కుడు, షైజాగ్‌బాషా, సనవుల్లా, అస్లాం, మునాఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంటరాని తనాన్ని రూపుమాపుదాం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో అంటరానితనాన్ని లేకుండా చేస్తామని డిప్యూటీ తహశీల్దార్ కృపావతి పేర్కొన్నారు. మండలంలోని గోవగుడిపల్లి పంచాయతీ అడపాల మాలపల్లిలో గురువారం పౌర హక్కుల దినోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కడైనా కులవివక్షత కు గురి అవుతున్నారా అగ్రకులాల వారు మీ పట్ల వివక్షత చూపుతుంటే ధైర్యంగా వచ్చి అధికారుల దృష్టికి గ్రామసభ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌ఐ సమత్‌ఖాన్, విఆర్‌ఒలు వెంకటసుబ్బయ్య, రాధిక పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- తహశీల్దార్ అమర్నాథ్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ అమర్నాథ్, ఎఒ రమేష్‌బాబు అన్నారు. బుధవారం తవళం పంచాయతీ పరిధిలోని ఎగువపల్లెలో పౌర హక్కుల దినోత్సవం సమావేశాన్ని మండల అధికారులతో, దళిత సంఘాల నాయకులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ, పౌర హక్కుల పై ప్రతి ఒక్కరు కనీస అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మండలంలో ప్రతినెల 30వ తేదీన దళితవాడల్లో సివిల్ రైట్స్‌డే సమావేశాన్ని నిర్వహిస్తూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని పరిష్కరిస్తూ వస్తున్నామని అన్నారు. దళిత వాడల్లో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు, ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడానికి, వారి సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను కల్పిస్తున్నాదని అన్నారు. సమావేశంలో వచ్చే ప్రతి అర్జీని స్వీకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గం చూపుతున్నామన్నారు. ఎగువపల్లెలో మురుగునీటి కాలువలను, విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఏఓ రమేష్ బాబు మాట్లాడుతూ మురుగు నీటి కాలువను ఏర్పాటు చేయడానికి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యలను ఇప్పటి వరకు పరిష్కరించలేదని అన్నారు. కాలక్షేపంతో సమావేశాలను నిర్వహిస్తే ప్రయోజనం లేదన్నారు. ఇటీవల ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మండలానికి కేవలం 9 యూనిట్లను మాత్రమే కేటా యించారని, అవి కూడా ప్రజలకు ఉపయోగంగా లేవన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా కనీసం 30 యూనిట్లను మండలానికి కేటాయించాలని వయో పరిమితి 60 సంవత్సరాల వరకు పెంచాలన్నారు. సివిల్



సమావేశంలో మాట్లాడుతున్న తహసిల్దార్ అమర్నాథ్

రైట్స్ డే సమావేశానికి విద్యుత్‌శాఖ మండల అధికారి హాజరు కాకపోతే సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. సివిల్ రైట్స్ డే సమావేశానికి మండల అధికారులు హాజరు కాకుండా, క్రింది స్థాయి సిబ్బందిని పంపించడం ఏంటని ప్రశ్నించారు. సమావేశానికి గైర్ హాజరైన ప్రతి డిపార్ట్మెంట్ అధికారికి నోటీసులు జారీ చేయాలని తహశీల్దార్‌కు విన్నవించారు. వచ్చే నెల 30వ తేదీన నిర్వహించే సివిల్ రైట్స్ డే సమావేశానికి ప్రతి శాఖకు సంబంధించిన మండల అధికారి తప్పనిసరిగా హాజరు కావాలని, లేకుంటే సమావేశాన్ని బహిష్కరించి, అధికారుల తీరును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. దళితుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న మండల అధికారులకు దళిత సంఘాల నాయకులు మునిరత్నం, సహదేవ, వీరనాల మాణిక్యంలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ నారాయణ, ఏపిఓ రమేష్, ఏపిఎం మురళి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రమేష్, ఆర్డబ్ల్యూఎస్ ఎఇమిథున్ చక్రవర్తి, హౌసింగ్ ఎఇ అమ ర్నాథ్, రీసర్వే డిటి సిరాజుద్దీన్, మండల సర్వేయర్ గోపీనాథ్, విఆర్‌ఒ శ్రీ నివాసులు, పంచాయతీ కార్యదర్శి గౌతమి, విహెచ్‌ఎ కుమార్ నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి వినోదంలో మట్టితో బొమ్మలు తయారీ



మట్టి బొమ్మలను తయారు చేస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

జన విజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవివినోదం కార్యక్రమం లో పిల్లలకు మట్టితో బొమ్మలు తయారు చేయడం నైపుణ్యాన్ని నేర్పించడం జరిగిందని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులలో మట్టితో బొమ్మలు తయారుచేయడం అనే ప్రక్రియ వలన చేతి నైపుణ్యం మెరుగవుతుందని, సృజనాత్మకత అభివృద్ధి చెందుతుందని, ఊహాశక్తి పెంపొందుతుందని, సమయపాలన, సహనం అభివృద్ధి చెందుతాయని, సామూహిక పని నైపుణ్యం అభివృద్ధి చెందుతుందని, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని అన్నారు. రంగులపై అవగాహన కలుగుతుందని, పర్యావరణం పట్ల అవగాహన, బాధ్యత కలుగుతుందని తెలిపారు. ఈ వేసవినోదం పది రోజుల పాటు కొనసాగుతుందని చక్రపాణి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బయారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు ప్రతాపరెడ్డి, శేషారెడ్డి, బయారెడ్డి, శివ, ప్రకాష్‌రెడ్డి, పాల్గొన్నారు.

వార్డులకు నిధుల కేటాయింపులో వివక్ష తగునా?

- అభివృద్ధికి ఆటంకం లేకుండా అజెండా అమలు చేయాలన్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వార్డులకు నిధుల కేటాయింపులో వివక్ష తగదని మెజార్టీ కౌన్సిలర్లు నిలదీశారు. బుధవారం మదనపల్లె మున్సిపాలిటీలో ప్రత్యేక కౌన్సిల్ అత్యవసర సమా వేశాలు చైర్ పర్సన్ వరపన మనుజారెడ్డి అధ్యక్షతన జరిగాయి. కౌన్సిల్ లో వైసిపికి మెజారిటీ ఉండటంతో రెండు సమావేశాల్లో కొన్ని అంశాలు మినహా అజెండాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ముఖ్యంగా మున్సిపాలిటీలో 35 వార్డులు ఉంటే అందులో కేవలం 5వార్డులకే రూ. 4.50 కోట్లు కేటాయించి మిగిలిన వార్డుల అభివృద్ధిని విస్మరించడం పట్ల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. మరో నాలుగు వార్డులకు రూ.40 లక్షలు మాత్రమే అభివృద్ధికి పరిమితం చేశారు. మిగిలిన 23 వార్డులకు కేటాయింపులు శూన్యమని 27 వార్డు కౌన్సిలర్ షేక్ కరీముల్లా ఆరోపిస్తూ ఇది ఆక్షేపనీయమని పేర్కొన్నారు. పుర ప్రజలందరూ మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తుంటే అభివృద్ధిలో అన్ని వార్డులకు సమాన కేటాయింపులు ఎందుకు ఉండవని లేవనెత్తారు. 23 వార్డులలో అభివృద్ధి పనులు అజెండాలో చేర్చకపోవడం వెనుక ఎవరున్నారని నిలదీశారు. ఆ వార్డు ప్రజలకు త్రాగునీరు, రోడ్లు, కాలువలు, మౌలిక సదుపాయాల అవసరం లేదా అని గొంతు విప్పారు. 6వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ అభివృద్ధికి అవరోధం లేకుండా, వార్డు ప్రజలకు ఇబ్బంది కాకుండా ఎజెండాను అమలు



పహల్గాం మృతులకు నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ కౌన్సిల్

చేయాలన్నారు. 23 వార్డు కౌన్సిలర్ గిరిజ మాట్లాడుతూ తమ వార్డులో ఒక్క అభివృద్ధి పని కూడా అజెండాలో చేర్చకపోవడం పై ఆవేదన వ్యక్తం చేస్తూ చైర్ పర్సన్, అధికారుల వైఖరిని ఖండించారు. 32వ వార్డు కౌన్సిలర్ నాగార్జున బాబు మాట్లాడుతూ మున్సిపాలిటీలో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు. ఈ సమావేశంలో కౌన్సి లర్లు, కో-ఆప్షన్ మెంబర్ శారదారెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పెహల్గాం కాల్పుల ఘటనలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని కౌన్సిల్ రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.



మహాభారత యజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

మహాభారత యజ్ఞం ప్రారంభం

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన మహాభారత యజ్ఞాన్ని గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నాయని ఉష్ణోగ్రతను దృష్టిలో ఉంచుకుని ఇక్కడికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. రాత్రింబవళ్లు జరుగుతున్నటువంటి ఈ కార్యక్రమానికి మహిళలు, యువతులు ఎక్కువగా వస్తుంటారని ఆగతాయిలు చేష్టలను నిర్వాహకులకు గమనిస్తూ శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహాభారత యజ్ఞం జరుపు ప్రాంతాలలో వర్షాలు సమృద్ధిగా కురిసే పంటలు బాగా పండి ఆ ప్రాంతం సస్యమంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పలు టిడిపి నాయకులు, మహాభారత యజ్ఞ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి హామీ ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



చిట్వేలి రవికుమార్

రాష్ట్ర అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇవ్వాలని కర్నూలు జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఈనెల 2న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో గతంలో అమరావతికి శంకుస్థాపనకు వచ్చి పిడికెడు మట్టి, చెంబు నీరు చల్లి వెళ్లి రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేశారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికై కోటి ఆశలతో ఎదురుచూస్తున్న ప్రజల ఆకాంక్షలు మోడీ రాకకై నిరీక్షిస్తున్నాయని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రానికి అన్ని రాష్ట్రాలతో పాటు సమాన హక్కులు కల్పించి ప్రత్యేక ప్యాకేజీ కల్పించాలని, విశాఖ, కడప ఉక్కు పరిశ్రమలను అభివృద్ధి చేయాలని కోరారు.

హాకీ, బాస్కెట్ బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంపులు ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల పరిధిలోని సిటిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి ఈనెల 31 వరకు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ, జినరాజదాస హాకీ క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ హాకీ, బాస్కెట్ బాల్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 8 నుంచి 14 ఏళ్ల వయసుగల వారు అర్హులు అని, క్యాంప్ కు వచ్చేవారు ఆధార్, ఫోటో తమ వెంట తీసురావాలని వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, నరేష్ బాబు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 6గంటల నుంచి 8.30 వరకు, సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు నిర్వహించబడునని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 7032140712 9885055402 నెంబర్ లలో సంప్రదించాలని కోరారు.

ఉచిత ఫుట్‌బాల్ కోచింగ్

ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ అన్నమయ్య, శాప్ సంయుక్త ఆధ్వర్యంలో మదనపల్లె జెడ్‌పి హైస్కూల్‌లో గురువారం నుంచి ఈనెల 31 వ తేదీ వరకు ఉచిత ఫుట్‌బాల్ శిక్షణ ఇస్తున్నట్లు క్యాంపు ఇన్‌ఛార్జి మహేంద్ర నాయక్ తెలిపారు. అనుభవం కలిగిన క్వాలిఫైడ్ కోచ్‌ల ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్ జాగుతుందని ఆసక్తి గల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మదనపల్లె జడ్‌పి హైస్కూల్, మిషన్ కాంపౌండ్, ఆరోగ్యవరం, పీలేరులో ఈ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు జిల్లా అసోసియేషన్ సెక్రెటరీ మురళీధర్ తెలిపారు. ఇతర వివరాలకు 9703110713, 8096607782 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

డిఎస్‌సి ఉచిత కోచింగ్ ఉపయోగకరం : డిఇఒ

ప్రజాశక్తి-కడప అర్బన్

యుటిఎఫ్ నిర్వహిస్తున్న డిఎస్‌సి ఉచిత కోచింగ్ అభ్యర్థులకు వరమని డిఇఒ షంషుద్దీన్ అన్నారు. బుధవారం కడప యుటిఎఫ్ భవన్‌లో డిఎస్‌సి అభ్యర్థులకు సైకాలజీ బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధీర్ఘ కాలం తర్వాత మెగా డిఎస్‌సిని నిర్వహిం చడం, కేవలం 40 రోజులు మాత్రమే పరీక్షలకు సమ యమున్న పరిస్థితులలో డిఎస్‌సి అభ్యర్థులు వేలాది రూపాయలను వెచ్చిస్తూ, సుదూర ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన అవసరం లేకుం డానే కడప యుటిఎఫ్ భవన్‌లో యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా కోచింగ్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఊరి బడిని కాపాడుకుందాం అనే నినాదంతో ముం దుకు వెళుతున్న యుటిఎఫ్ ఎలాంటి లాభాపేక్ష లేకుండా నవతరం ప్రభుత్వ ఉపాధ్యాయులను తయారు చేయాలనే సంకల్పంతో కోచింగ్‌ను నిర్వహిస్తున్నదన్నారు. ప్రభుత్వ విద్య నిరాధా రణకు గురైతే పేద, బడుగు, బలహీనవర్గాల వారు ఉచితంగా విద్యనందుకునే అవకాశాన్ని కోల్పోతారన్నారు. డిఎస్‌సి అభ్యర్థులు ప్రణాళి కాబద్ధంగా చదివి, ఆత్మస్థైర్యంతో ముందుకు వెళితే అద్భుత ఫలితాలను పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఎస్‌సి బోధకులు మస్తాన్, జిల్లా కార్యదర్శి సివి.రమణ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రకాష్ బాబు, అభ్యర్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన ఓబుల్‌రెడ్డి

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - బద్వేలు

ఉపాధ్యాయ వృత్తిలో 41 సంవత్సరాలుగా ఉంటూ, ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి సింగన ఓబుల్‌రెడ్డి అని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో గోపవరం ఎంఇఒ పి.రఘు రామిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఓబుల్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వృత్తి పట్ల అంకిత భావం, సమయపాలన, క్రమ శిక్షణ, ఓర్పుగా నేర్పుగా పనిచేసే వ్యక్తిత్వం ఓబుల్‌రెడ్డికే స్వంతమన్నారు. 41 సంవత్సరాలు విద్యా క్షేత్రంలో ఉపాధ్యాయునిగా పనిచేసి ఎంతోమందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఘనత ఓబుల్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇటు ఉపాధ్యాయునిగా, అటు ఉపాధ్యాయ సంఘం నాయకునిగా సమన్వయంతో ముందుకు సాగుతూ విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంలోనూ, ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించడంలోనూ క్రియాశీలకంగా వ్యవహరించాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా మాట్లాడుతూ జిల్లాలో యుటిఎఫ్ ఉద్యమాన్ని నిర్మించడంలో సింగన ఓబుల్‌రెడ్డి పాత్ర గణనీయమైనదన్నారు.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఐసిని బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నదని, ఐఆర్‌డిఏ మంత్రసాని పాత్ర పోషిస్తున్నదని ఎల్‌ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డిఐ పెంచుతూ విదేశాల్లో ఎత్తిపోయిన బీమా కంపెనీలను మనదేశంలోకి నేరుగా అనుమతిస్తున్నదని తెలిపారు. ఎవరికి ఉపయోగపడని ఐపిఓ మరోసారి ఇవ్వాలని, ఎల్‌ఐసి షేర్లు అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నదని పేర్కొన్నారు. సంస్థలో కొన్ని అపరిష్కృత సమస్యలపై ఉద్యోగులలో ఆందోళన నెలకొన్నదని తెలిపారు. ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపు ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ సమ్మె గత అన్ని సమ్మెల కంటే గొప్పగా జరగాలని తెలిపారు. ఈ సమ్మె మన కోసం, మన బిడ్డల కోసం, మన భవిష్యత్తు కోసం అని ఎఐఐఇఎ స్పష్టం చేస్తున్నదని పేర్కొన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు కూడా అదే రోజు సమ్మె చేస్తున్నాయని తెలిపారు.


ర్యాలీ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ సిబ్బంది

డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కడప

కెనరా బ్యాంక్ రీజినల్ ఆఫీస్ కడప ప్రాదేశికాధికారి బి.అరుణ జ్యోతి నేతృత్వంలో బుధవారం కడప నగరంలో డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ బ్యాంకింగ్‌లో వినియోగించగలిగే వివిధ సురక్షితమైన మరియు సౌకర్యవంతమైన విధానాలను వివరించారు. ఈ ర్యాలీలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. డిప్యూటీ మేనేజర్లు ఎస్.రమేష్, విలియం, లక్ష్మీ నారాయణ, డిజిటల్ బ్యాంకింగ్ అవగాహన కార్యక్రమంలో ప్రజలకు మార్గనిర్దేశనం చేశారు.

కడప ఉక్కుపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-కడప

ప్రధాని నరేంద్ర మోడీ మే 2న రాష్ట్ర పర్యటన సందర్భంగా కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారా చొరవ చూపాలని డిసిసి ఉపాధ్యక్షులు కదిరి ప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా విభజన చట్టంలో పొందుపరిచారని అయితే ఇంతవరకు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. కడప ఉక్కు పరిశ్రమ నేటికీ పది సంవత్సరాలు దాటినా ఉక్కు పరిశ్రమ శిలాఫలాకాలకె పరిమితమైందే తప్ప ఆచరణలో ఏర్పాటు చేపట్టడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.